సాక్షి
వికారాబాద్

శుక్రవారం ▪ 6 ▪ డిసెంబర్ ▪ 2024



‘ఆసరా’ పంపిణీపై ఆరా

ఆసరా పెన్షన్ పంపిణీ వ్యవస్థపై కేంద్ర బృందం సభ్యులు గురువారం తాండూరు మండలంలో ఆరా తీశారు. 10లో▸



పాలనలో విఫలం

రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆరోపించారు. 10లో▸



అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 11లో▸



నాలుగు లేన్లుగా విస్తరించాల్సిన రోడ్డు ఇదే..

టెండర్‌తో సరి !

- మన్నెగూడ నుంచి పోలీస్ అకాడమీ వరకు నాలుగు లేన్ల రహదారికి 2022లో అనుమతులు
- రూ.956 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తి
- మూడేళ్లు కావస్తున్నా ముందుకు పడని అడుగులు
- గ్రీన్ ట్రిబ్యునల్ పేరుతో జాప్యం
- రక్తసిక్తమవుతున్న రోడ్డు
- ఏడాదిలో 200 వరకు నమోదవుతున్న మరణాలు

నెత్తురోడుతున్న రహదారి

కర్ణాటక, పరిగి, కొడంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలు.. వికారాబాద్, తాండూరు వైపు నుంచి వచ్చే వాహనాలు మన్నెగూడ వద్ద కలుస్తాయి. దీంతో మన్నెగూడ నుంచి హైదరాబాద్ వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు ఇటీవల హైదరాబాద్ నుంచి అనంతగిరికి పర్యాటకుల తాకిడి కూడా పెరిగింది. ఒక్కోసారి కిలో మీటర్ల మేర వాహనాలు ఆగిపోతుంటాయి. రోడ్డుపై విపరీతమైన మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పోలీసుల లెక్కల ప్రకారం ఏడాదికి సగటున ఈ రహదారిలో 200 మంది వరకు మృత్యువాత పడుతున్నారు. ఇటీవలి కాలంలో కర్ణాటక, తాండూరు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వస్తున్న సిమెంటు ట్యాంకర్లు, ఎర్రమట్టి లారీల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల చిట్టెంపల్లి, ఆలూరు గేట్ల మధ్యలో కొన్ని గంటల వ్యవధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు చనిపోగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా పాలకులు మన్నెగూడ – పోలీస్ అకాడమీ వరకు నాలుగు లేన్ల రహదారిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చూడాలని ఇటు ప్రజలు అటు వాహనచోదకులు కోరుతున్నారు.

వికారాబాద్: హైదరాబాద్ – బీజాపూర్ హైవే నిర్మాణంలో చోటుచేసుకుంటున్న జాప్యంపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. మన్నెగూడ నుంచి నగరంలోని పోలీస్ అకాడమీ వరకు చేపట్టనున్న నాలుగు లేన్ల రహదారిపై జిల్లా వాసుల ఆశలు నీరుగారుతున్నాయి.. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో మొదట్లో ఆశలు చిగురించాయి. కుర్చీ ఎక్కి ఏడాది గడిచినా ఏ కదలికా లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. నిర్మాణ పనుల బాధ్యత కేంద్రం చూడాల్సి ఉండగా భూ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం చూడాలి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాల్సి ఉండటంతో ఓ వ్యక్తి గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాడు. ఆ కేసును సాకుగా చూపి పనులను ప్రారంభించడంలేదు. పెద్దపెద్ద అటవీ ప్రాంతాల్లో సైతం రోడ్డు నిర్మాణాలు పూర్తవుతుంటే కేవలం రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల విషయంలో గ్రీన్ ట్రిబ్యునల్ పేరు చెప్పి జాప్యం చేయడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు.

నేతల వైఫల్యం

సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ తోపాటు ముగ్గురు ఎమ్మెల్యేలు అధికార పార్టీకి చెందిన వారే ఉన్నారు. పలు పర్యాయాలు చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి హేమాహేమీలు ఎంపీలుగా కొనసాగుతూ వస్తున్నారు. కానీ రోడ్డు పనులు మాత్రం ప్రారంభం కాకపోవడం పూర్తిగా రాజకీయ నేతల వైఫల్యమేనని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇరుకు రోడ్డుతో ప్రమాధాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనదారుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. 2017లో హైదరాబాద్ – బీజాపూర్ అంతర్రాష్ట్ర రహదారి 163ను జాతీయ రహదారిగా ప్రకటించారు. రద్దీ అధికంగా ఉండే మన్నెగూడ నుంచి పోలీస్ అకాడమీ వరకు 46 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారి నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

టెండర్ పూర్తయ్యి మూడేళ్లు కావస్తున్నా..

2022 మార్చిలో నాలుగు లేన్ల రహదారికి టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. పనులను మేఘా సంస్థ దక్కించుకుంది. మూడేళ్లు కావస్తున్నా ఒక్క అడగు కూడా ముందుకు పడలేదు. హైవే నిర్మాణం కోసం 18 నెలల గడువు ఇవ్వగా పనులు ప్రారంభం కాకుండానే గడువు ముగిసింది. ఇదిలా ఉండగా సదరు కాంట్రాక్టర్ మిషన్లు తీసుకొచ్చి రోడ్డు పక్కన పెట్టడం, రహదారికి ఇరువైపులా ఉన్న హోటళ్లు, షాపులను తొలగించాలని ఆరు నెలల కోసారి నోటీసులు ఇవ్వడం పరిపాటిగా మారింది.



మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకులంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి వర్షిణి

విద్యార్థుల భోజనంలో రాజీపడొద్దు

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి

మొయినాబాద్: విద్యార్థులకు పెట్టే భోజనంలో రాజీ పడొద్దని.. నాణ్యమైన భోజనం పెట్టాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి అన్నారు. మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాల, చిలుకూరు గురుకుల బాలుర పాఠశాలలను గురువారం రాత్రి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం బాగుందా.. మెనూ ప్రకారం పెడుతున్నారా.. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. భోజనం ఒక్కోసారి సరిగా ఉండటం లేదని.. ఉదయం పూట స్నానం చేయడానికి వేడినీళ్లు సరిగా రావడంలేదని.. ల్యాబ్ సరిగా లేదని.. ఎంసెట్, నీట్ కోచింగ్ ఇప్పించాలని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని చెప్పారు. చిలుకూరు గురుకులంలో విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. ఆమె వెంట చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతోపాటు టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సత్యనారాయణ, నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, మహేందర్ ముదిరాజ్, రాజుగౌడ్, రమేష్, రియాజ్ తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రంగారెడ్డి డీఏఓ నర్సింహారావు

ఆమనగల్లు: రైతులు భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని రాముసుంతల రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ఆచార్య జయ శంకర్ వ్యవసాయ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్షపై అవగాహన కల్పించారు. అంతకు ముందు జరిగినన సమావేశంలో వ్యవసాయాధికారి నర్సింహారావు మాట్లాడారు. విచక్షణ రహితంగా ఎరువులను వాడొద్దని సూచించారు. నేల స్వభావానికి అనుగుణంగా వాడి అధిక దిగుబడులు పొందాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త దామోదర రాజు భూసార పరీక్షల ఆవశ్యకత గురించి వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త మాధవి పంటల్లో ఎరువులు వాడే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ అదిలక్ష్మి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీఓ మాధురి, ఏఈఓలు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంటశాల

నేడు కొడంగల్‌లో మంత్రుల పర్యటన

- భారీ వంటశాలలను ప్రారంభించనున్న అమాత్యులు

కొడంగల్: పట్టణంలో శుక్రవారం రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ్మా పర్యటించనున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో నిర్మించిన భారీ వంటశాల (సెంట్రలైజ్‌డ్ కమ్యూనిటీ కిచెన్)ను వీరు ప్రారంభిస్తారు. కొడంగల్ నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 28వేల మంది విద్యార్థులకు రోజూ ఉదయం పూట అల్పాహారం అందించనున్నారు. హరేరామ హరేకృష్ణ చారిటబుల్ ట్రస్టుకు బాధ్యతను అప్పగించారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబిలిటీ) నిధులతో నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని వసతులతో కూడిన వంటశాలను సిద్ధం చేశారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా సీఎం నియోజకవర్గమైన కొడంగల్‌ను ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు పౌష్టికాహారం అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే రోజూ ఉదయం పూట విద్యార్థులకు న్యూట్రీషనల్ ఫుడ్‌ను అందించడానికి ఏర్పాట్లు చేశారు.

మాడ్గుల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

మాడ్గుల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర నాయకులు

వడ్డెర సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

కడ్తాల్: వడ్డెర కులస్తుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి డిమాండ్ చేశారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు పిలుపు మేరకు గురువారం సంఘం నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారని తెలిపారు. అంతేకాకుండా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగార్జున, బోసురవి, గండికోట నర్సింహ, యాదయ్య, వెంకటేశ్, జంగయ్య, రాజు, వెంకటేశ్, మహేశ్ ఉన్నారు.

అర్హులకే రైతుభరోసా

- పంటలు పండించే వారికే పథకం
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం
- రూ.260 కోట్లతో రోడ్ల అభివృద్ధి
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



ఏన్కతలలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: పంటలు పండించే వారికే రైతు భరోసా ఇస్తామని రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఏన్కతలలో రూ.52 లక్షలతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, మొరంగపల్లిలో రూ.25 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానా నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో 66 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 25మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాబినేట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా సంక్రాంతి పండుగకు అర్హులైన అన్నదాతలకు రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. రెండు లక్షలలోపు ఉన్న పంట రుణాలను మాఫీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఖజానా నిండుకున్నా సీఎం రేవంత్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. త్వరలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధి, మరమ్మతులకు రూ.260 కోట్లు మంజూరైనట్లు వివరించారు. నియోజకవర్గంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. మోమిన్‌పేటలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలకు పైలెట్ ప్రాజెక్టు కింద సోలార్ విద్యుత్ సదుపాయం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుభాష్, నాయకులు నరోత్తంరెడ్డి, సుభాష్‌గౌడు, సురేందర్, సిరాజొద్దీన్, ఎరాజ్, ఎజాస్, విఠల్, తహసీల్దార్ ప్రభువులు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు

అనంతగిరి: దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో మెలగాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ బస్టాండ్‌లో ప్రజాపాలన దినోత్సవం, మద్గుల్ చిట్టంపల్లి డీఆర్‌సీ భవనంలో జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులను మనతో సమానంగా చూడాలని, చిన్న చూపు చూడరాదన్నారు. వారు కూడా సమాజంలో భాగమేనన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకున్నా రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీ జీతాలు వస్తున్నాయన్నారు. ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేశామని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

అధికారం చేపట్టిన 24గంటల్లోనే ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేశామని.. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం వికారాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలతో ముందుకు సాగుతోందన్నారు. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడుతోందన్నారు. నవంబర్ 30 నాటికి మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్రంలో 114 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని, రూ.3,856 కోట్లు చార్జీల రూపంలో ఆదా చేసుకున్నారని తెలిపారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అరుణ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సేంద్రియ సాగు లాభదాయకం

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పరిగి: రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగును పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని నస్కల్ గ్రామంలో రైతులకు పంటల సాగు, నేల స్వభావంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధిక రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల నేల జీవరాశులను నష్టపోతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వేసి కలియ దున్నడం ద్వారా నేలలో సారవంతం పెంచవచ్చని పేర్కొన్నారు. రైతులు మట్టి పరీక్షలు చేసుకోవడం వల్ల వ్యవసాయ భూమిలో ఏ పోషకాల లభ్యత ఉంది.. ఎలాంటి పోషకాలు వేయాలి అని తెలుస్తుందన్నారు. చాలా మంది వరి పంట పూర్తవగానే వరి కొయ్యలను కాల్చివేస్తున్నారని.. అలా చేయడం మంచిది కాదన్నారు. పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారి కావ్య, రైతులు పాల్గొన్నారు.

పెద్దేముల్ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న అతీఫ్

తాండూరు రూరల్: పెద్దేముల్ గ్రామానికి చెందిన సయ్యద్ అతీఫ్‌కు డాక్టరేట్ లభించింది. ఈయన హైదరాబాద్‌లోని షాదన్ ఉమెన్స్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాలు, మైక్రో ఫైనాన్స్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఇందుకు గాను ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లా కేఎస్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. పెద్దేముల్ వాసికి డాక్టరేట్ రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యాలాల వైద్యాధికారిగా రూబియా నాజ్



రూబియా నాజ్‌కు స్వాగతం పలుకుతున్న వైద్య సిబ్బంది

యాలాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారిగా రూబియా నాజ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన వైద్యురాలు బదిలీ కావడంతో ఇన్‌చార్జ్ వైద్యులతో నెట్టుకొచ్చారు. తాండూరులోని మాతాశిశు ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న రూబియాను ఉన్నతాధికారులు యాలాలకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సీహెచ్‌ఓ చంద్రప్రకాష్, సిబ్బంది మంజుల, బసయ్య, భారతి, లక్ష్మి, కవిత, జగదీశ్వరి, సంగీత, ఇంద్రమ్మ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. సంఘం కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన పాలక వర్గం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 22 మంది రైతులకు రూ.2.9 కోట్ల అప్పులు మంజూరు చేశామని, నూతనంగా 19 మందిని సభ్యులుగా చేర్చుకున్నామని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి, నవంబర్ 30వ తేదీ వరకు జమ, ఖర్చులను ఆమోదించామని, దీర్ఘకాలిక వ్యవసాయ అప్పులను ఒకే సభ్యుడికి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచినట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవ రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కొండ్రు స్వప్న శ్రీనివాస్, చాపల యాదగిరి, సీఈఓ వై.రాందాసు తదితరులు పాల్గన్నారు.

క్లుప్తంగా

హామీలు అమలు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యంసీపీఐ(యూ) నాయకులు

అనంతగిరి: ప్రభుత్వం ఎన్నికల సమయంలో పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని యంసీపీఐ(యూ) డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్‌లో కలెక్టర్ ప్రతిక్‌జైన్‌కు ఆ పార్టీ జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. పేద మహిళలకు నెలకు రూ.2,500లు అందజేయాలన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సంవత్సరానికి రూ.15వేలు మంజూరు చేయాలన్నారు. వికలాంగుల పెన్షన్‌ను రూ.6వేలు, వృద్ధుల పెన్షన్లను వెంటనే పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు శేఖర్, సంగమ్మ, నర్సింలు, రూప్లా నాయక్, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యంలో మట్టిరాళ్లు



మోమిన్‌పేట: మండల పరిధిలోని ఇబ్రాచిట్టంపల్లికి వచ్చిన పీడీఎస్ బియ్యంలో మట్టిరాళ్లు ఉన్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. గురువారం ఉదయం చౌక ధరల దుకాణంలో బియ్యం తీసుకునేందుకు వెళ్లిన స్థానికులు ఓ బస్తాను విప్పి చూడగా మట్టి రాళ్లు ఉన్నాయి. దీంతో మరో బస్తా బస్తాను, ఆ తర్వాత ఇంకో బస్తాను విప్పారు. ఇలా అన్నింట్లోనూ మట్టి రాళ్లే కనిపించడంతో బియ్యం సరఫరాపై మండిపడ్డారు. అధికారులు స్పందించి నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు

పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి



వాహనాల తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

పరిగి: మైనర్లకు వాహనాలు ఇస్తే కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తామని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణ కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలకు సంబంధించి ధ్రువపత్రాలను ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఏడాది పాలనలో విఫలం

- ఆరు గ్యారంటీల అమలు జాడేలేదు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్



తాండూరులో బైక్ ర్యాలీ

తాండూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది ప్రభుత్వ పాలన విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం తాండూరు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఏడాది పాలనపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మెనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోయారని విమర్శించారు. మరోవైపు 6 గ్యారంటీలను అమలు చేసి తీరు తామని ఎన్నికల ప్రచారం చేసుకున్నారన్నారు. రానున్న కాలంలో ప్రజలు కాంగ్రెస్‌పై తిరగబడే పరిస్థితులు వచ్చాయన్నారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. గ్రామ పంచాయతీ, పరిషత్ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గ్రామాలలో బీజేపీ పోటీ చేసి విజయఢంకా మ్రోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అంతారం లలిత, సుదర్శన్‌గౌడ్, మల్లేశం, భద్రేశ్వర్, జుంటిపల్లి వెంకట్, అంతారం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1,200 కోట్లతో రోడ్ల అభివృద్ధి

కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: కొడంగల్‌లోని ఆర్‌అండ్‌బీ రోడ్లను రూ.1,200 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఉన్న సింగల్ రోడ్లను డబుల్‌గా మారుస్తున్నట్లు తెలిపారు. ప్రతీతండాకు, గ్రామానికి బీటీ లేదా సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. దుద్యాల, కొత్తపల్లి, గుండ్‌మాల్‌లో మండల కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ఒక్కో మండలానికి రూ.8.30 కోట్లు, కొడంగల్, కోస్గి మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్ గుప్త, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ఏఎంసీ డైరెక్టర్ ఆసిఫ్‌ఖాన్, నర్సింలుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై నిగ్గు తేల్చాలని కలెక్టర్‌కు వినతి



ఫిర్యాదు చేసిన ప్రతిని చూపుతున్న సంగీతా ఠాకూర్

తాండూరు టౌన్: మాయమైన తాండూరు మున్సిపల్ జేసీబీ జాడ తేల్చాలని, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం వెంటనే వెంటనే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని బీఆర్‌ఎస్ 20వ వార్డు కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ జేసీబీ ఎక్కడ ఉందో నిగ్గు తేల్చాలని, దాని స్థానంలో ప్రైవేటు జేసీబీకి చెల్లించిన బిల్లుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలు గడుస్తున్నా కౌన్సిల్ సమావేశం ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. సకాలంలో మున్సిపల్ సమావేశాలు ఏర్పాటు చేయకపోవడంతో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయన్నారు. 20వ వార్డు పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. దీంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పట్టణ ప్రణాళికపై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. అధికారులు స్పందించి సదరు అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరామన్నారు.

సీపీఐ నాయకుల మృతి తీరని లోటు

నివాళులర్పిస్తున్న జిల్లా కమిటీ



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

తాండూరు టౌన్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌ల మృతి పార్టీకి తీరని లోటని జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ పేర్కొన్నారు. గురువారం తాండూరు పట్టణ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పార్టీ కార్యాలయంలో రెడ్ గార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి బాధ్యుడిగా ఎదిగిన బాలమల్లేశ్ అంకితభావం చిరస్మరణీయమన్నారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ పేదల పక్షాన పోరాడేవారన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన పోటు ప్రసాద్ ఆదర్శనీయుడన్నారు. వారు భౌతికంగా లేకపోయినా వారి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పీర్‌మహ్మద్, రవీందర్, మునీర్ అహ్మద్, అబ్దుల్లా, కౌన్సిల్ సభ్యులు నసీమా బేగం, సురేష్, చంద్రయ్య, ఖాదర్, జగదాంబ పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

- బీఆర్‌ఎస్ నేతల ఆందోళన
- ఇబ్రహీంపట్నంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ నేతల నిరసన

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులపై రేవంత్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిని అక్రమంగా, అప్రజాస్వామికంగా అరెస్టు చేశారని నిరసిస్తూ గురువారం ఇబ్రహీంపట్నంలో ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించింది ఏమీ లేదన్నారు.

రాష్ట్రంలో పోలీసుల రాజ్యం

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పాలనలో పోలీసులు రాజ్యమేలుతున్నారని రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులను అకారణంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావును ఓ కానిస్టేబుల్ బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విజయోత్సవాలు జరుపుకొంటున్న కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు మరో ఉద్యమం చేపట్టేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతోందని తెలిపారు.

వివాహిత అదృశ్యం



సంగీత (ఫైల్)

తాండూరు రూరల్: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీను, సంపూర్ణ దంపతులు. శ్రీను ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, సంగీత ఇంటి వద్దే ఉంటోంది. బుధవారం శ్రీను విధులకు వెళ్లగా.. సాయంత్రం 6:30 గంటలకు సంగీత నుంచి వీడియో కాల్ వచ్చింది. ఇంటికి ఎప్పుడొస్తావు అని సంగీత అడగగా.. రాత్రి వరకు వచ్చేస్తా.. అని బదులిచ్చాడు. రాత్రి 8:30 గంటలకు శ్రీను ఇంటికి చేరుకోగా సంగీత కనిపించలేదు. బంధువులు, తెలిసినవారిని ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



రామకృష్ణారెడ్డి (ఫైల్)

పూడూరు: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వ్యవసాయ కూలీ మృతిచెందిన సంఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బార్లపల్లికి చెందిన పామెన రామకృష్ణారెడ్డి (58), కొంగి నర్సింలు, రామస్వామి ముగ్గురూ కలిసి ఇదే గ్రామానికి చెందిన రాంచంద్రారెడ్డి కంది పంటలో పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. ట్రాక్టర్‌తో మందు స్ప్రే చేస్తుండగా రామకృష్ణారెడ్డి తలకు విద్యుత్ తీగలు తాకాయి. దీంతో అతను కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. నర్సింలు, రామస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఇరువురిని వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బుచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

మీర్‌పేట: తప్పిపోయిన బాలున్ని మీర్‌పేట పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. నందనవనం వాంబేకాలనీకి చెందిన సంజప్ప, సుకన్యల కుమారుడు యువరాజు(9)కి మతిస్థిమితం సరిగ్గా లేదు. బుధవారం రాత్రి ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లి దారితప్పాడు. జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ వద్ద పెట్రోలింగ్ సిబ్బంది గమనించి వివరాలు అడగగా.. సరిగా చెప్పలేదు. దీంతో బాలున్ని చేరదీసి స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఠాణాకు రాగా.. యువరాజును వారికి అప్పగించారు

అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడిన వ్యక్తుల అరెస్ట్

9 డిటోనేటర్లు స్వాధీనం

యాచారం: వ్యవసాయ పొలంలో అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. 9 డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నర్సింహరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి చౌదర్‌పల్లి గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో శేఖర్‌రెడ్డి, వెంకటేశ్, రాజు అనే ముగ్గురు వ్యక్తులు అక్రమంగా బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారని ఫిర్యాదు అందింది. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి సోదాలు చేపట్టగా.. పేలుడుకు ఉపయోగించే డిటో నేటర్లు లభించాయి. దీంతో నిందితులతో పాటు పేలుడు సామగ్రి, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

7నుంచి సీఎం కప్ క్రీడోత్సవాలు

మంచాల: ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్-2024 క్రీడోత్సవాలను నిర్వహించనుందని ఎంపీడీఓ బాల శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే వారు 14నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండాలని వెల్లడించారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా తదితర పోటీలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జోనల్, జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

'ఆసరా' పంపిణీపై ఆరా



అంతారంలో ఆసరా పథకం లబ్ధిదారులతో కేంద్ర బృందం సభ్యులు

- తాండూరు మండలంలో కేంద్ర బృందం పర్యటన
- లబ్ధిదారులతో మాట్లాడి వివరాల సేకరణ

తాండూరు రూరల్: ఆసరా పెన్షన్ పంపిణీ వ్యవస్థపై కేంద్ర బృందం సభ్యులు గురువారం తాండూరు మండలంలో ఆరా తీశారు. డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీడీ పూజ, ఎస్‌ఐఆర్‌డీ శిక్షణ అధికారులు జ్యోత్స్న, భూషయ్యతో కలిసి గురువారం మల్కాపూర్, అంతారం, కోత్లాపూర్, బెల్కటూర్ గ్రామాల్లో పర్యటించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతీ నెల పెన్షన్ డబ్బులు ఇస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ పంపిణీకి సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నాయా..? అని ఆరా తీశారు. అనంతరం లబ్ధిదారులు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. మృతి చెందిన పెన్షనర్ల పేర్లను వెంటనే తొలగించాలన్నారు. తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్‌తో భేటీ అయ్యారు.

పట్టుదలకు విజయం దాసోహం

- ఏడాది కాలంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సౌమ్యారెడ్డి
- కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూనే జేఎల్‌గా ఎంపికైన సుదర్శన్



సౌమ్యారెడ్డి



సుదర్శన్

మొయినాబాద్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగ సాధన కత్తిమీద సాము లాంటిదే. కానీ పట్టుదలకు శ్రమ తోడైతే సాధించలేనిది ఏదీ లేదని పలువురు నిరూపిస్తున్నారు. మొయినాబాద్ మండలం చిలుకూరుకు చెందిన గడ్డం సౌమ్యారెడ్డి ఏడాది కాలంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకుంది. గురుకుల టీజీటీ, పీజీటీ, జేఎల్‌తో పాటు గత బుధవారం విడుదలైన ఫలితాల్లో గెజిటెడ్ హోదా కలిగిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైంది. 2014లో వివాహం జరిగిన అనంతరం భర్త శ్రీధర్‌రెడ్డితో కలిసి చిలుకూరులో ఉంటూ డిగ్రీ, పీజీ ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసింది. 2022లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించింది. ప్రస్తుతం ఇద్దరు పిల్లల పోషణను చూసుకుంటూనే పట్టుదలగా చదివి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ఉద్యోగం చేస్తూనే..

చేవెళ్ల: చేవెళ్ల మండలం అంతారం గ్రామానికి చెందిన సుదర్శన్ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 2018లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన ఆయన.. ప్రస్తుతం గచ్చిబౌలి పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. కానీ ప్రొఫెసర్ కావాలనే తల లక్ష్యాన్ని మరవలేదు. జాబ్ చేస్తూనే చదువు కొనసాగిస్తూ 2022లో ఉస్మానియా యునివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. ఈక్రమంలో తెలంగాణ సాహితీవేత్తలు, హృదయ ఘోష, స్వాతంత్ర్య సమరయోధుడు అడ్డూరి అయోధ్య రామయ్య అనే పుస్తకాలు రచనలు చేశాడు. గెజిటెడ్ అధికారిగా ఎదగాలనే ఆలోచనతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వేసిన జూనియర్ లెక్చరర్ పరీక్షలు రాసి, జేఎల్‌గా ఎంపికయ్యాడు. సామాన్య పేద కుటుంబానికి చెందిన తనను తల్లిదండ్రులు జంగమ్మ, పర్మయ్య చాలా కష్టపడి చదివించారని తెలిపాడు. లెక్చరర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ప్రొఫెసర్ కావాలనే తన కల సాకారానికి మొదటి అడుగు పడిందని చెప్పాడు.

కులాంతర వివాహాల రక్షణ చట్టం తేవాలి

కుల, మత దురహంకార హత్యలను అరికట్టాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: కుల, మతాంతర వివాహాల చట్టాలు తీసుకురావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగాళ్ల భాస్కర్‌లు డిమాండ్ చేశారు. ఇటీవల హత్యకు గురైన కానిస్టేబుల్ నాగమణి భర్త శ్రీకాంత్‌ను రాయపోల్‌లోని వారి నివాసంలో గురువారం నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీకాంత్.. నాగమణిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని ఆమె సోదరుడు పరమేశ్ నాగమణిని హత్యచేయడం బాధకరమన్నారు. తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకున్నందునే ఆమెను అంతమొందించాడని పేర్కొన్నారు. కుల దురంహకార హత్యను ఆస్తి తగాదాగా చిత్రీకరించడం సరైందికాదన్నారు. మృతిరాలి పేరుపై ఉన్న భూమిని గతంలోనే నిందితుడికి ఇచ్చినట్లు ఆధారాలున్నాయని వెల్లడించారు. కులం తక్కువ కారణంగానే హత్య జరిగిందని, కుల దురహంకార హత్యలను అరికట్టడానికి ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘాతుకానికి పాల్పడిన పరమేష్, అతనికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేల్, యాదయ్య, జంగయ్య, జగన్, మండల కార్యదర్శి బుగ్గరాములు, నాయకులు జగన్, భిక్షపతి, రమేష్, యాదగిరి, చరణ్, యాదయ్యలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

ఎంపీడీఓ అపర్ణ



ఎంఈఓ శంకర్‌రాథోడ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాలుగా షాబాద్ ఎంఈఓగా పనిచేసి ఇటీవల బదిలీపై రాజేంద్రనగర్ మండలానికి వెళ్లిన ఎంఈఓ శంకర్‌రాథోడ్‌కు పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులందరితో కలిసి ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థులకు మెరుగైన విద్యనందించేలా ఎంఈఓ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి , మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణ, రాష్ట్రబాధ్యులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పార్టీలకు అతీతంగా అన్నిప్రాంతాల అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- రూ.15కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు. పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం పరిధి కుంట్లూర్, పెద్ద అంబర్‌పేట, పసుమాముల గ్రామాల్లో రూ.15కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం చైర్‌పర్సన్ పండుగల జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ, కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని, పరిధి నాలుగు పురపాలికలను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కౌన్సిలర్లు అనుపమ, కృష్ణారెడ్డి, మురళీధర్ రెడ్డి, శ్రీనివాస్, విద్య, రాజేందర్, గీత, మణెమ్మ, హరిశంకర్, సుజాత, అనురాధ, దేవిడి గీత, కోఆప్షన్ సభ్యులు శంకరయ్య, సయ్యద్ హజారే బేగం, ఖలీం, మేనేజర్ కిరణ్, శానిటరి అధికారి దశరథ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, సభ్యులు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేయాలని సభ్యులకు సూచించారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని హామీఇచ్చారు.

భగీరథ నీటితోనే ఆరోగ్యం

చేవెళ్ల: ప్రజలు ఆర్‌ఓ ఫిల్టర్ వాటర్ తాగడంతో అనారోగ్యాల బారినపడే ప్రమాదం ఉందని, ప్రజలకు ప్రభుత్వం ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా అందించే మిషన్ భగీరథ నీరే శుద్ధమైన, స్వచ్ఛమైన నీరు అని గ్రామీణ నీటి సరఫరా శాఖ జిల్లా కార్యాలయం అధికారి, చేవెళ్ల ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం మిషన్ భగీరథ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల, దేవునిఎర్రవల్లి గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి కాలనీల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం మిషన్ భగీరథ నీటిని శుద్ధిచేసి అందిస్తుందని చెప్పారు. ఫిల్టర్ వాటర్‌తో ప్రజలకు అనేక అనారోగ్య సమస్యలను తెచ్చిపెడతాయని గుర్తించాలన్నారు. ప్రజలు తప్పని సరిగా మిషన్ భగీరథ నల్లా ద్వారా వచ్చే నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంజనీర్లు గీతా స్రవంతి, జాహ్నవి, టెక్నీషియన్ హరికృష్ణ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, నాయకులు శైలజ, వసంతం, సమత, పాండురంగారెడ్డి, నరోత్తం రెడ్డి, దేవునిఎర్రవల్లి మాజీ సర్పంచ్ మానిక్యరెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.